సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 15 । మే । 2025



ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం

మలికిపురం: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు (అప్పనరామునిలంక) రూ.5 లక్షల విరాళం కమిటీ సభ్యులకు అందించారు.




మనసున్న మారాజు

సాంకేతికత లేని ఆ రోజుల్లో ఆనకట్టను నిర్మించాడు సర్ ఆర్థర్ కాటన్. అందుకే ఆయనను మనసున్న మారాజు అని జనం కీర్తిస్తున్నారు.

8లో

1,869 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 1,869 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.45 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

పాలిసెట్‌లో జిల్లాకు 1, 3, 5, 7, 10 ర్యాంకులు

96.85 శాతం ఉత్తీర్ణత



వున్నా వరుణ్‌తేజ్, 5వ ర్యాంకు



ఆకుల నిరంజన్‌శ్రీరామ్, 7వ ర్యాంకు



బళ్ల రిషిత శ్రీస్వప్న, 10వ ర్యాంకు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో జిల్లాలోని విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 1, 3, 5, 7, 10 ర్యాంకులు సాధించారు. జిల్లాలో పాలిసెట్ ఫలితాలలో 96.85శాతం విద్యార్థులు అర్హత సాధించారు. జిల్లాలో 5,172 మంది పాలిసెట్‌కు హాజరుకాగా 5,009 మంది అర్హత సాధించారు. జిల్లాకు చెందిన బడ్డి శశివెంకట్ రాష్ట్రస్థాయిలో ఫస్ట్‌ర్యాంకు, మెర్ల జే ఎస్ ఎన్‌వి చంద్రహర్ష రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, వున్నా వరణ్‌తేజ్ రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు, ఆకుల నిరంజన్ శ్రీరామ్ రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు, బళ్ల రిషిత శ్రీస్వప్న రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, జిల్లా కోఆర్డినేటర్ వి.నాగేశ్వరరావు తెలిపారు.

జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు

స్థానికుల ఆందోళన



జగ్గంపేట జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్లు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

జగ్గంపేట: స్థానిక జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఐదు అధికారులు తొలగించడంపై స్థానికుల నుంచి నిరసన వ్యక్తమైంది. దీనితో జగనన్నకాలనీ వాసులు ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహానికి, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు తెలియజేశారు. దీంతోవారు జగ్గంపేట విద్యుత్ డీఈ వీరభద్రరావుతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్లు జగనన్నకాలనీలో వున్నవి తీయడం సరికాదని తెలిపారు. అయితే వేసవి కారణంగా గ్రామంలో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయకపోవడంతో జగనన్న కాలనీలో ప్రస్తుతం ఉపయోగించని ట్రాన్స్‌ఫార్మర్లు మారుస్తున్నామని విద్యుత్ డీఈ వారికి వివరించారు. జగ్గంపేటలో రెండు రోజులుగా పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, పాడైపోవడంతో పలు కాలనీలలో విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్లు వాడుతున్నట్లు, కొత్తవి వచ్చిన వెంటనే జగనన్న కాలనీలో యథావిధిగా ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రాథమిక విద్యకు సర్దుపోటు!



- విద్యా వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కుట్ర
- అంతా అస్తవ్యస్తం..!
- పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో ఉపాధ్యాయ పోస్టుల కుదింపు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 767 పోస్టుల సర్దుబాటు
- క్లస్టర్ వ్యవస్థకు మంగళం.. మోడల్ స్కూల్ విధానానికి నాంది
- కూటమి ప్రభుత్వ చర్యలతో మిగులు పోస్టులు పెరిగే అవకాశం



రాజమండ్రి రూరల్ శాటిలైట్‌సిటీ పాఠశాల

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిందా..? ఇందులో భాగంగానే పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ పేరుతో గందరగోళానికి తెర తీసిందా..? ఈ పరిణామం ప్రాథమిక విద్యపై తీవ్ర ప్రభావం చూపనుందా..? మిగులు ఉపాధ్యాయులు పెరిగి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి భంగం కలగనుందా..? అంటే అవుననే సమాధానం వస్తోంది ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నుంచి.

ఇదీ సంగతి

ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే క్రమంలో కూటమి ప్రభుత్వం అసంబద్ధ విధానాల అమలుకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన క్లస్టర్ విధానాన్ని తొలగించి మోడల్ స్కూల్స్ విధానానికి శ్రీకారం చుట్టింది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా గత ప్రభుత్వం జీవో 117 పేరిట పాఠశాలల విలీన ప్రక్రియ చేపట్టింది. కూటమి అధికారంలోకి వచ్చాక జీఓను రద్దు చేసింది. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలోనూ ఉపాధ్యాయుల నుంచి విమర్శలు ఎదుర్కొంది. తాజాగా పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో కొత్త విధానానికి తెర తీసింది. ఇందులో భాగంగా తొమ్మిది రకాల పాఠశాలలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొన్ని రోజులుగా చేసిన కసరత్తు మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం చేపట్టిన తాజా చర్యలతో మిగులు పోస్టులు పెరిగి, ప్రాథమిక విద్యకు నష్టం తప్పదని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

యూపీ స్కూళ్ల కొనసాగింపు

పాఠశాలల పునర్నిర్మాణం పేరుతో కూటమి ప్రభుత్వం ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలలను ఎత్తివేయాలని భావించింది. తల్లిదండ్రులు, ఆయా ప్రాంతాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న యూపీ స్కూళ్లను యథావిధిగా కొనసాగించేందుకు అంగీకరించింది. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 72 అప్పర్ ప్రైమరీ పాఠశాలలున్నాయి. ఇవి యథావిధిగా కొనసాగనున్నాయి.

767 పోస్టుల సర్దుబాటు

ఉపాధ్యాయుల సర్దుబాటుపై గురువులు గుర్రుగా ఉన్నారు. అసంబద్ధ విధానాలతో ప్రక్రియ చేపట్టిందని ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నించగా సర్దుబాటు ప్రక్రియ కాస్తా గందరగోళంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆధారంగా ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల వారీగా మంగళవారం జాబితా విడుదల చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 767 మిగులు ఉపాధ్యాయులు ఉన్నారు. వారిని వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో భవిష్యత్తులో ఎస్‌జీటీ (సెకండరీ గ్రేడ్) పోస్టుల భర్తీ కలగానే మారనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 371 మంది ఉపాధ్యాయులను వివిధ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, హెచ్‌ఎం పోస్టులకు, మోడల్ ప్రైమరీ పాఠశాల్లో సర్దుబాటు చేశారు. 31 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సెకండరీ గ్రేడ్ టీచర్లుగా సర్దుబాటు చేశారు. హెచ్‌ఓడీ పూల్‌లో ఉన్న 355 మంది ఉపాధ్యాయులను సైతం వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల నియామకం ఇలా..

- ఫౌండేషన్ స్కూల్ (పీపీ1, పీపీ2 1–2వ తరగతి)
  1–30 మంది విద్యార్థులకు 1 ఎస్జీటీ, 31–60 విద్యార్థులకు 2 ఎస్జీటీలను నియమించారు.
- బేసిక్ ప్రైమరీ స్కూల్ (పీపీ–1, పీపీ2, 1–5వ తరగతి)లో 20 మందికి ఒక ఎస్జీటీ, 60 మందికి ఇద్దరు ఎస్జీటీలను నియమించారు.
- మోడల్ ప్రైమరీ స్కూల్స్ (పీపీ1, 2, 1–5వ తరగతి వరకు)
  59 మంది విద్యార్థులకు ముగ్గురు (హెచ్‌ఎం లేదా స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ) ఉపాధ్యాయులను కేటాయించారు. అంతేగాక 150 మంది విద్యార్థులకు నలుగురిని నియమిస్తారు.
- అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో 1–10 వరకు ఒక స్కూల్ అసిస్టెంట్, 11 నుంచి 30 వరకు ఇద్దరు, 31 నుంచి 140 విద్యార్థులుంటే నలుగురు, 141 నుంచి 175 మందికి ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తున్నారు.

డీఎస్సీని మరిపించేందుకు ఎత్తులు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చంద్రబాబు, లోకేష్ ఎన్నికల సమయంలో హామీలు గుప్పించారు. ప్రభుత్వం ఏర్పాటైంది. ఇక డీఎస్సీ నిర్వహించాల్సిన సమయం ఆసన్నం కావడంతో ఎలాగోలా మెగా డీఎస్సీని కాలయాపన చేసేందుకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సర్దుబాటుకు ఉన్న అర్థాన్నే మార్చేశారని ఉపాధ్యాయ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. వర్క్ అడ్జస్ట్‌మెంట్ (సర్దుబాటు) అంటే ఒకటి లేదా రెండు నెలల పాటు మిగులు టీచర్లను అవసరమైన చోట తాత్కాలికంగా వినియోగించుకోవడం. ఇదిలా ఉంటే టీడీపీ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్న వాదన ఉపాధ్యాయుల నుంచి వినిపిస్తోంది.

ధూప, దీప నైవేద్యాలకు దరఖాస్తుల ఆహ్వానం



జిల్లా దేవదాయ శాఖాధికారి సుబ్బారావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గ్రామాల్లో ఆదాయం లేని ఆలయాలకు ధూప, దీప నైవేద్యాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయశాఖాధికారి సుబ్బారావు తెలిపారు. కాకినాడ దేవదాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న చిన్న ఆలయాల్లో ఆదాయం లేకపోవడంతో ధూప, దీప నైవేద్యాలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆయా ఆలయాలకు ప్రతీ నెలా రూ.10 వేలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తులను స్థానిక ఎమ్మెల్యే ద్వారా అందివ్వాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్న ఆలయాలకు చెందిన కమిటీ సభ్యులు, అర్చకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నవరం దేవస్థానం వైదిక కమిటీ పునర్ వ్యవస్థీకరణ

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వైదిక కమిటీని పునర్ వ్యవస్థీకరించారు. కమిటీలో ఆరుగురు సభ్యులకు అదనంగా మరో ఇద్దరు పండితులను నియమించారు. గొల్లపల్లి గణపతి ఘనపాఠీ, వేదుల సూర్యనారాయణ ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు ఘనపాఠీ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, వ్రత పురోహిత స్పెషల్‌గ్రేడ్ సూపర్‌వైజర్ ఛామర్తి కన్నబాబు వైదిక కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వీరితో బాటు చిట్టి శివ ఘనపాఠీని, వ్రత పురోహితుడు పాలంకి పట్టాభిరామమూర్తిని సభ్యులుగా చేర్చారు. ఈ ఎనిమిది మంది దేవస్థానంలో జరిగే వైదిక కార్యక్రమాల గురించి చైర్మన్, ఈఓలకు సలహాలిస్తారు.

సబ్ ప్లాన్ టెండర్లు ఎస్సీలకే కేటాయించాలి

విదసం, రాజోలు ప్రదర్శన చైతన్య సమితి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న విదసం నాయకులు రాజామణి

మలికిపురం: రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేసే అభివృద్ధి పనులు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు అవసరమయ్యే సరకుల సరఫరా టెండర్లు దళితులకే కేటాయించాలని విస్తృత దళిత సంఘాల (విదసం), ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమావేశం డిమాండ్ చేసింది. బుధవారం విదసం ఐక్యవేదిక రాష్ట్ర సమితి, రాజోలు పరిరక్షణ సమితి సంయుక్త సమావేశం మలికిపురం మండలం శంకరగుప్తంలో సభ్యులు చింతా సత్య ఇంటి వద్ద జరిగింది. విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ సక్రమ అమలు కోసం ప్రభుత్వం ఎస్‌టీఎస్ (సబ్ ప్లాన్ టెండర్లు ఎస్సీలకే) అనే కొత్త స్కీమ్ ప్రవేశ పెట్టాలని సలహా ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న 750 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 50 రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉన్న లక్షా నాలుగు వేల మంది విద్యార్థులకు పప్పులు, నూనెలు, కూరగాయలు, గుడ్లు, మాంసం సరఫరా కోసం కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఏటా రూ.150 కోట్లు చెల్లిస్తోందని, ఈ సరఫరా దారుల్లో ఒక్క టెండర్లో కూడా దళితుడు దక్కించుకోలేకపోవడం గమనార్హం అన్నారు. రాష్ట్రంలో మొత్తం 55,600 అంగన్వాడీలు ఉంటే దళిత వాడల్లో 12 వేల అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని వాటికి గుడ్లు, చెక్కీలు, పప్పులు, నూనెల సరఫరాకు ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి రూ.372 కోట్లు కేటాయిస్తే ఆ కాంట్రాక్టులు అన్ని అగ్రకులాల చేతుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. హాస్టళ్లు, దళితవాడల్లో అంగన్వాడీలకు సరకులు సరఫరా టెండర్లు దళితులకు ఇస్తే 1,000 నుంచి 1500 కుటుంబాలకు జీవనోపాధి కల్పించవచ్చని అన్నారు.

మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

- ఉమ్మడి జిల్లాలో 50 మంది ఉద్యోగులు అర్హులు
- ఆ ఉద్యోగుల సర్వీస్ రికార్డులను కోరిన మున్సిపల్ ఆర్డీ కార్యాలయం

అమలాపురం టౌన్: మున్సిపాలిటీల్లో పదోన్నతుల పర్వం మొదలవుతోంది. మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న వివిధ విభాగాల జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్తతులు పొందేందుకు అర్హత పొందిన వారి వివరాల సేకరణ జరుగుతోంది. ఖాళీ అయిన సీనియర్ అసిస్టెంట్ల పోస్టుల్లో జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి భర్తీ చేసే యోచనలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటీవ్ (డీఎంఏ) కార్యాలయం ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న మున్సిపాలిటీల్లో మొత్తం 50 మంది జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతులకు అర్హులై ఉండి ఎదురు చూస్తున్నారు. కాకినాడ జిల్లాలో 19, తూర్పుగోదావరి జిల్లాలో 11, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 20 మంది జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతుల జాబితాలో ఉన్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయం పరిధిలోని ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో 171 మంది జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతుల అర్హతల జాబితాలో ఉన్నట్లు ఆర్డీ కార్యాలయం జారీచేసిన ఉత్తర్వుల్లో ఉంది. కోనసీమ జిల్లాకు సంబంధించి ఉన్న మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో పదోన్నతుల కోసం అర్హులైన జూనియర్ అసిస్టెంట్ల వివరాలను కూడా మున్సిపల్ రీజనల్ కార్యాలయం జాబితా పంపించింది. అయితే పదోన్నతులకు ఉమ్మడి జిల్లాలో 50 మంది జూనియర్ అసిస్టెంట్లు అర్హులై ఉన్నప్పటికీ ఇందులో ఎంతమందికి పదోన్నతులు లభిస్తాయన్న దానిపై ఆ ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. డీఎంఏ కార్యాలయం ఎంతమందికి పదోన్నతులు కల్పిస్తుందోనని ఆ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఈ లోగా ఆయా మున్సిపాలిటీల కమిషనర్లకు తమ తమ మున్సిపాలిటీల పరిధిలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ల సర్వీస్ రికార్డులను తక్షణమే పంపించాలని రీజనల్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆదేశాల మేరకు అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయితీల కమిషనర్లు తమ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ల సర్వీస్ రికార్డులను పంపించనున్నారు. మూడు రోజుల్లో అమలాపురం మున్సిపాలిటీకి సంబంధించిన జూనియర్ అసిస్టెంట్ల సర్వీస్ రికార్డులను ఆర్డీ కార్యాలయానికి పంపించే ఏర్పాట్లు చేస్తానని కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. పదోన్నతులకు అర్హులైన జూనియర్ అసిస్టెంట్లలో కొద్దిమంది ఉద్యోగ విరమణ చేశారు. ఉదాహరణకు అమలాపురం మున్సిపాలిటీలో ఉన్న ఆరుగురి జూనియర్ అసిస్టెంట్లలో ఒకరు ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. అమలాపురం మున్సిపాలిటీలో 6, రామచంద్రపురం మున్సిపాలిటీలో 5, మండపేట మున్సిపాలిటీలో 6, ముమ్మిడివరం నగర పంచాయతీలో 3 చొప్పున జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి.

ప్చ్... ఎండు మిర్చి!

- ధర లేక రైతుల దిగాలు
- కంట కన్నీరు తెప్పిస్తున్న సాగు
- కిలో రూ.600 నుంచి రూ.150కు పతనం
- అందుకున్న లేత కాపులు
- కౌలు రైతులకు కోలుకోని నష్టం
- ఎకరాకు రూ. లక్ష నష్టం
- కళ్లాల్లోనే నిల్వలు



కొనే నాథుడు లేక కళ్లాల్లోనే ఉండిపోయిన ఎండు మిర్చి

దేవరపల్లి: ఎండు మిర్చి ధర పతనమైంది. అయినా మిర్చిని అడిగే నాథుడు కనిపించడంలేదు. అధిక పెట్టుబడులతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కళ్లాల్లో రైతులు దిగాలుగా ఉన్నారు. ఈ ఏడాది మిరప తోటలకు పూతదశలో పేను, ఎర్రనల్లి వంటి చీడపీడలు సోకాయి. దీంతో పూతలు దెబ్బతిన్నాయి. రూ.వేలకు వేలు ఖర్చు పెట్టి పూతను కాపాడటానికి రైతులు మందులు పిచికారీ చేశారు. ప్రయోజనం శూన్యం. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. వాతావరణ పరిస్థితులు, ప్రకృతి అనుకూలిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. సాధారణంగా ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది మిర్చి పంటకు ప్రతికూల వాతావరణం ఏర్పడడంతో కాపులు లేక దిగుబడులు పడిపోయాయి. ముదర కాపులు ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు దిగుబడులు వచ్చాయి. ఏటా సంక్రాంతికి మిరపతోటలు పూత, పిందెలతో ఉంటాయి. ఈ ఏడాది పూతలు దెబ్బతినడంతో రైతులు ఆశించిన స్థాయిలో పిందె ఏర్పడలేదు. ఫిబ్రవరి రెండవ వారం నుంచి ఎండు మిర్చి విక్రయాలు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో కిలో రూ.600 పలికింది. ఈ ధర ఏప్రిల్ వరకు ఉంది. మే నెల నుంచి ధర పడిపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

1,250 ఎకరాల్లో మిర్చి సాగు

గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో రైతులు వేసవి పంటగా ఎండు మిర్చి సాగు చేస్తున్నారు. మూడు మండలాల్లో సుమారు 1200 ఎకరాల్లో మిర్చి సాగు జరుగుతోంది. దేవరపల్లి మండలంలో పల్లంట్ల, కురుకూరు, లక్ష్మీపురం, కొత్తగూడెం, దేవరపల్లి గ్రామాల్లో మిరప పంట సాగు చేస్తున్నారు. పల్లంట్ల, కురుకూరు గ్రామాల్లో ప్రధాన పంటగా రైతులు మిర్చిని పండిస్తుంటారు. రెండు గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో పంట సాగు చేసినట్టు అధికారుల అంచనా. దాదాపు నాలుగు దశాబ్దాలుగా మిరప పంట సాగు చేస్తున్నట్టు రైతులు తెలిపారు. **తుపానులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వాతావరణం అనుకూలించకపోవడం వల్ల తోటలు దెబ్బతిని రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. దిగుబడులు ఉంటే పంట లాభదాయక**మేనని రైతులు అంటున్నారు. మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా కౌలు రైతులు నష్టపోతున్న పరిస్థితి. పల్లంట్ల, కురుకూరు ఎండు మిర్చికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు ఉండేది. ఇప్పటికి పల్లంట్ల ఎండు మిర్చికి మార్కెట్లో బ్రాండ్ ఇమేజ్ ఉంది. అయితే తోటలకు చీడపీడలు ఎక్కువగా ఆశించడంతో పురుగు మందుల వాడకం ఎక్కువ కావడం, పంట మార్పిడి జరగకపోవడం వల్ల భూముల్లో సారం తగ్గడం వంటి కారణాల వల్ల ఇక్కడ కూడా మిర్చి నాణ్యత, కారం ఘాటు తగ్గినట్టు రైతులు తెలిపారు.



దేవరపల్లి మండలం పల్లంట్లలో ఎండు మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

లేత కాపులు అందుకున్నా ధర లేదు

ముదర కాపులు దిగుబడులు లేక నష్టపోయిన రైతులకు లేత కాపులు కొంత వరకు ఊరట నిచ్చాయి. ఏప్రిల్ నుంచి తోటలు చీడపీడల నుంచి కోలుకోవడంతో లేత కాపులు దిగినట్టు రైతులు తెలిపారు. ఎండు మిర్చి సీజన్ ముగియడంతో లేత కాపులకు ధర లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది మిర్చి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టి పంట పండించారు. ఎకరం కౌలు రూ.50 వేల నుంచి 70 వేలు పలికింది. పండిన పంటను అమ్మితే రూ. లక్ష రావడం కష్టంగా ఉందని రైలులు లబోదిబోమంటున్నారు. లేతగా వచ్చిన పంటకు ధర లేదని రైతులు వాపోతున్నారు. సీజన్ ముగిసినా కళ్లాలో ఎక్కడ మిర్చి అక్కడే ఉంది.

కోలుకోవడం కష్టం



మిర్చి రైతులు కోలుకోవడం కష్టం. కౌలుదారుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. ముదర కాపులు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. ఎకరాకు రూ.1.50 లక్షల పెట్టుబడి అయింది. పురుగు మందుల ఖర్చు ఎక్కువైంది. ఎన్ని మందులు కొట్టినా పూతలు నిలబడలేదు. ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట వేశాను. ఎకరా కౌలు రూ.50 వేలు, పెట్టుబడి రూ. లక్ష అయింది. ఆరు ఎకరాల సాగుకు సుమారు రూ.10 లక్షలు ఖర్చుకాగా, వచ్చిన ఆదాయం రూ.5 లక్షలు మాత్రమే. లేత కాపులు ప్రస్తుతం కిలో రూ.150 నుంచి రూ.200 పలుకుతున్నాయి.

– నూతలపాటి రమేష్, రైతు, పల్లంట్ల, దేవరపల్లి మండలం

గిట్టుబాటు కావడంలేదు



మిర్చి పంట సాగు గిట్టుబాటు కావడంలేదు. తోటలకు చీడపీడలు, తెగుళ్లు ఎక్కువగా ఆశించి పూతలు దెబ్బతింటున్నాయి. రెండేళ్లుగా ఎండు మిర్చికి ధర ఉన్నప్పటికి దిగుబడి లేక నష్టం వస్తోంది. నేను 4 ఎకరాలు కౌలుకు తీసుకుని పంట వేశాను. కౌలు, పెట్టుబడి ఎకరాకు రూ.1.50 లక్షలు అయింది. కౌలు డబ్బు కూడా రాని పరిస్థితి. ఇతర ప్రాంతాల నుంచి ఎండు మిర్చిని తీసుకు వచ్చి సైకిల్ వ్యాపారస్తులు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. మా గోడును పట్టించుకున్న నాథుడు లేదు.

– కాసాని సత్యనారాయణ, కౌలు రైతు, పల్లంట్ల, దేవరపల్లి మండలం

తక్కువ ధరకు కర్ణాటక మిర్చి

జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి సీజన్‌లో వ్యాపారులు ఎండు మిర్చిని దిగుమతి చేసుకుని తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కర్ణాటక, భద్రాచలం, గుంటూరు, తాడేపల్లిగూడెం ప్రాంతాల నుంచి ఈ ఏడాది వ్యాపారులు ఈ ప్రాంతానికి ఎండు మిర్చిని తీసుకు వచ్చి తక్కువ ధరకు విక్రయాలు జరిపారు. పల్లంట్ల, కురుకూరు గ్రామాల్లో కిలో ధర రూ.600 పలకగా, సైకిల్ వ్యాపారుల వద్ద రూ.200 నుంచి రూ.250కి లభించింది. ధరలో భారీ వ్యత్యాసం ఉండడంతో ప్రజలు తక్కువ ధరకు దొరుకుతున్న మిర్చిని కొనుగోలు చేశారు.

క్లుప్తంగా

ఏపీఆర్‌జేసీలో 'తిరుమల'కు ప్రథమ ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న అకడమిక్ డైరెక్టర్ సతీష్ బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షా ఫలితాలలో రాజమహేంద్రవరం తిరుమల విద్యార్థులు బాలినేని కళ్యాణ్ రామ్ ఎంపీసీ విభాగంలో, బొడ్డుపల్లి మనోజ్ కుమార్ బైపీసీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించాడని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె.ఫణిశ్రీ వసంత్ 3, ఆర్. చహ్నా 6, పూన్న వరుణ్ తేజ్ 8, కె.సాకేత్ గుప్తా 9వ ర్యాంకులు సాధించారన్నారు. టాప్ 50లో 28, టాప్ 100లో 55, టాప్ 500లో 203 ర్యాంకులు సాధించి అత్యుత్తమ ఫలితాలు పొందారన్నారు. ఆ విద్యార్థులను తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో ట్రిప్స్ విజయభేరి



చవి వజావత్ హన్విత యశస్విని లోహిత్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో రాజమహేంద్రవరం ట్రిప్స్ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. పరీక్షకు హాజరైన 50 మందీ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. చవి వజావత్ 500 మార్కులకు 490 (98 శాతం) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో, హన్విత యశస్విని, లోహిత్ శ్రీనివాస్ 96.6 శాతంతో ద్వితీయస్థానంలో నిలిచారు. 90 శాతం పైగా మార్కులు 14 మంది, 80 శాతం నుంచి 90 శాతం మార్కులు 26 మంది, 70 శాతం నుంచి 80 శాతం మార్కులు ఏడుగురు, 60 శాతం నుంచి 70 శాతం మార్కులు ముగ్గురు విద్యార్థులు సాధించారని స్కూలు చైర్మన్ బాలా త్రిపుర సుందరి తెలిపారు. ఆ విద్యార్థులను విద్యార్థులను డెరెక్టర్లు వంశీకృష్ణ, రూపాదేవి అభినందించారు.

మనసున్న మారాజు



శిథిలమైన కపిలేశ్వరపురం లాకుల తలుపు



ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియాన్ని సందర్శించిన విద్యార్థులు (ఫైల్)

- డెల్టా శిల్పి సర్ ఆర్థర్ కాటన్
- సైనికుడు, ఇంజినీర్‌గా విశిష్ట సేవలు
- ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మాణం
- గోదావరి జిల్లాలు సస్యశ్యామలం
- నేడు ఆ మహనీయుని జయంతి

కపిలేశ్వరపురం: మానవత్వానికి సరిహద్దులు ఉండవని నిరూపించిన మహనీయుడు అతడు. అగ్నిని, నీటిని వశపర్చుకునేటంత సాంకేతికత లేని ఆ రోజుల్లో తన మస్తిష్క మధనంతో ఆనకట్టను నిర్మించిన డెల్టా శిల్పి. కరవు కాటకాలకు చలించి, స్వదేశీ పాలకులను ఒప్పించి ఆనకట్టను నిర్మించిన మహోన్నతుడు. ఆయనే సర్ ఆర్థర్ కాటన్. అందుకే అయన మరణించి 126 ఏళ్లయినా ఇక్కడి ప్రజలు నిత్యం స్మరించుకుంటున్నారు. ఊరూ వాడా అయన విగ్రహాలను ఏర్పాటు చేసి, నివాళులర్పిస్తున్నారు. మే 15 (గురువారం) కాటన్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

ఉద్యోగ రీత్యా..

యూకేలోని కాంబర్మిర్ ఆబిలో హెన్నీ, కాల్వెలి కాటన్ దంపతులకు 1803 మే 15న 10వ సంతానంగా సర్ ఆర్థర్ థామస్ కాటన్ జన్మించారు. చదువు పూర్తయిన తర్వాత 1821లో మద్రాసులో ఇంజినీర్‌గా చేరేందుకు సముద్ర మార్గాన తొలిసారిగా ఇండియాకు వచ్చాడు. జాతీయత రీత్యా బ్రిటీషు పాలక వర్గమే అయినా ఆలోచనలన్నీ కరవు కాటకాలతో అలమటిస్తున్న భారతీయ ప్రాంతాన్ని సుభిక్షం చేయడం చుట్టూ తిరిగాయి. దానిలో



అంగరలో కాటన్ విగ్రహం

భాగంగా ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించాలని కాటన్ నిర్ణయించుకున్నాడు. 1847 ఏప్రిల్‌లో గోదావరి ఆనకట్ట పనులు మొదలుపెట్టారు. కాటన్ పలుమార్లు అనారోగ్యం పాలై వైద్యం, విశ్రాంతి కోసం విదేశాలకు వెళ్లిపోవాల్సి వచ్చేది. ఆయన కృషితో 1852 మార్చిలో ధవళేశ్వరం ఆనకట్ట పూర్తయ్యింది. అనంతరం గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసింది. కాటన్ 1860లో ఉద్యోగ విరమణ చేశాడు. ఆయనకు సర్ అనే బిరుదును ప్రదానం చేశారు. 1861లో స్వదేశానికి తిరిగి వెళ్లిన కాటన్.. 1862, 1863 లో రెండుసార్లు ఇండియాకు వచ్చి ప్రాజెక్టుల నిర్మాణాలకు పలు సలహాలిచ్చి వెళ్లారు. 1899 జూలై 24న యూకేలోని సర్రైలో గల డార్కింగ్ నగరంలో 96 ఏళ్ల రెండు నెలల వయసులో తుదిశ్వాస విడిచారు.

పాత బ్యారేజీ నిర్మాణ సంగతులివీ..

1844లో ఆనకట్ట నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు, కాలువల తవ్వకాలు, ఇతర పనులకు రూ.12.50 లక్షలు, మొత్తం రూ.16.50 లక్షలకు ప్రాథమిక అంచనాను రూపొందించారు. 1846 డిసెంబర్‌లో లండన్ డైరెక్టర్ల నుంచి ఆమోదం వచ్చింది. 1847–1852 మధ్య కాలంలో సున్నపురాయితో బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. పదివేల మంది కూలీలు, 500 మంది కుమ్మరి వృత్తిదారులు, మరో 500 మంది వడ్రంగుల ఐదేళ్ల కృషితో ఆనకట్ట రూపుదిద్దుకుంది. ప్రారంభ రోజుల్లో ఉభయ గోదావరి జిల్లాల్లోని 5.88 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 1889 నాటికి 9.18 లక్షల ఎకరాలకు పెరిగింది.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం ఖరీఫ్, రబీ రెండు పంటల సాగు కాలంలోనూ సాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు, ఆర్థికసాయం అందజేత తదితర అనేక అంశాల్లో రైతులను ఇబ్బంది పెట్టింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 28 ఎత్తిపోతల పథకాలు ఉండగా, నిర్వహణ, మరమ్మతులు లేని కారణంగా 16 పథకాలకు చెందిన మోటార్లు, పంపుల సామర్థ్యం తగ్గింది. ఉమ్మడి జిల్లా పరిధిలో 431 కిలోమీటర్ల మేర ప్రధాన పంట కాలువలు, 2,024 కిలోమీటర్ల పిల్ల కాలువలు, 379 కిలోమీటర్ల ప్రధాన మురుగు కాలువలు, 363 కిలోమీటర్ల మధ్య తరహా కాలువలు, 1,184 కిలోమీటర్ల చిన్న తరహా కాలువలు ఉన్నాయి. వీటిలో అనేకం నిర్వహణ లోపంతో ఉన్నాయి. అనేక చోట్ల లాకులు, స్లూయిజ్‌ల తలుపులు తప్పుపట్టడం, చిల్లులు పడటంతో అధ్వానంగా ఉన్నాయి. సుందరపల్లి, కూళ్ల వద్ద 150 మీటర్ల మేర గోదావరి గట్టు మార్జిన్ కోతకు గురైంది. కాట్రేనికోన మండలం కుండలేశ్వరం వద్ద గౌతమి కుడి ఏటిగట్టు 200 మీటర్ల మేర కుంగిపోయింది.

లక్షల ఎకరాలకు నీరు

బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 10.13 లక్షల ఎకరాలకు సాగునీరందుతోంది. తూర్పు డెల్టా పరిధిలో 254 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువలు, 857 కిలోమీటర్ల మేర బ్రాంచి, పంట కాలువలు, 19 లాకులు ఉండగా 2,45, 333 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.


- మధ్య డెల్టా పరిధిలో 199 కిలోమీటర్ల ప్రధాన కాలువలు, 989 కిలోమీటర్ల బ్రాంచి, పంట కాలువలు, 16 లాకులు ఉండగా 2,01,896 ఎకరాలకు సాగునీరు ఇస్తున్నారు.
- పశ్చిమ గోదావరి జిల్లాకు పశ్చిమ డెల్టా పరిధిలో 370 కిలోమీటర్ల ప్రధాన కాలువలు, 1,178 కిలోమీటర్ల బ్రాంచి, పంట కాలువలు, 26 లాకులు ఉండగా 5,29,962 ఎకరాలకు నీరు అందిస్తున్నారు.

నూతన బ్యారేజీ నిర్మాణం

కాటన్ 1852లో నిర్మించిన బ్యారేజీ వందేళ్లకు పైగా మన్నికలో ఉంది. ఆ తర్వాత బ్యారేజీ సామర్థ్యం తగ్గుతూ వస్తుండటంతో భారత ప్రభుత్వం నూతనంగా బ్యారేజీ నిర్మాణానికి పూనుకుంది. పాత ఆనకట్టకు 39.93 మీటర్ల దూరంలో నదికి ఎగువలో ర్యాలి ఆనకట్ట విభాగం వద్ద 1970, ఏప్రిల్ 11న పనులను ప్రారంభించి 1978 నాటికి పూర్తి చేయాలని సంకల్పించింది.

1982లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నామకరణం చేసి, జాతికి అంకితం చేశారు. బ్యారేజీలోని ధవళేశ్వరం, ర్యాలి విభాగాలను గౌతమి బ్యారేజీగా, మద్దూరు, విజ్జేశ్వరం విభాగాలను వశిష్ట బ్యారేజీగా నిర్వహణ సౌలభ్యం కోసం పిలిచేవారు. గౌతమి ద్వారా 64 వేల క్యూసెక్కులు, వశిష్ట ద్వారా 36,500 క్యూసెక్కుల నీరు బయటకు ప్రవహిస్తోంది.

సీతాకోక చిలుక రెక్కల ఆకృతిలో నాణేలు



సమోవా దేశం ముద్రించిన నాణేలు

అమలాపురం టౌన్: ప్రపంచంలో ఏ దేశ నాణేలైనా గుండ్రంగా లేదా నలుపలకలుగా ఉంటాయి. అయితే సమోవా దేశం విడుదల చేసిన నాణేలు మాత్రం సీతాకోక చిలుక రెక్కల ఆకృతిలో కనువిందు చేస్తున్నాయి. వీటిని అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. ప్రపంచంలోనే తొలిసారిగా సీతాకోక చిలుక రెక్కల ఆకృతిలో ముద్రించిన నాణేలు ఇవేనని కామేశ్వర్ తెలిపారు. 20 సెంట్లు ముఖ విలువ గల ఈ నాణేలు వెండి పూతతో రాగితో తయారయ్యాయి. ఒక్కొక్క నాణెంపై చైనా దేశపు ఒక్కొక్క రాశి చక్రాన్ని ముద్రించారు. చైనా దేశపు రాశి చక్రాల అధిపతులైన కుక్క, డ్రాగన్, మేక, గుర్రం, కోతి, ఎద్దు, పంది, కుందేలు, ఎలుక, కోడిపుంజు, పాము, పులి చిత్రాలు నాణేలపై ముద్రించారు.

చింత చిగురు కేజీ రూ.900



చింత చిగురును విక్రయిస్తున్న వ్యాపారి

ఐ.పోలవరం: చింత చిగురుకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోతోంది. కోనసీమ జిల్లాలోనే కేజీ రూ.850 నుంచి రూ.900 వరకూ పలుకుతోంది. అమలాపురం, రామచంద్రపురం, అంబాజీపేట, మురమళ్ల, కొత్తపేటల్లోని వారపు సంతాల్లో సైతం చింతాకు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. స్థానికంగా చింత చెట్టు ఎక్కి కొమ్మ చివరన ఉండే చింత చిగురు సేకరించేవారు తగ్గిపోయారు. ఇదే సమయంలో హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఎగుమతి అవ్వడం వల్ల కూడా స్థానికంగా ధర పెరగడానికి కారణమని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. అనేక శాకాహార, మాంసాహార వంటలకు మరింత రుచి కావడానికి చింత చిగురు వాడతారు.

ప్రేమ పేరుతో యువకుడి మోసం

ముమ్మిడివరం: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బీఎస్ఎన్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై డి.జ్వాలా సాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ముమ్మిడివరం మండలం గాడిలంకకు చెందిన ఒక యువతిని ఐ.పోలవరం మండలం పశువుల్లంకకు చెందిన చింతా సురేష్ రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. తీరా పెళ్లి చేసుకోమంటే తన ఇంట్లో ఒప్పుకోవడం లేదని ముఖం చాటేశారు. దీంతో యువతి ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేశారు. అమలాపురం డీఎస్పీ టీఎస్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై డి.జ్వాలా సాగర్ దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి పాలన అవినీతిమయం



మాజీ మంత్రి సూర్యారావు

మలికిపురం: కూటమి ప్రభుత్వ పాలనంతా అవినీతిమయమేనని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురంలో పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ రూ.3 వేలకు పెంచిన పింఛన్‌ను కాస్త పెంచి ఇస్తున్న పథకం తప్ప, ఇంకా ఏమైనా రాష్ట్రంలో ఉందా చంద్రబాబూ అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీనైనా అమలు చేశావా అని నిలదీశారు. ప్రశ్నిస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రస్తుత వేసవిలో అనేక ఉపాధి హామీ పనులు చేయాల్సి ఉండగా ఆ పథకాన్ని అవినీతిమయం చేశారన్నారు. చింతలపల్లి రోడ్డుకు రూ.7 కోట్లను మాజీ సీఎం జగన్ మంజూరు చేయిస్తే పనులు ప్రారంభించినట్లే నటించిన కూటమి ప్రభుత్వం.. బెర్మ్ తవ్విన మట్టిని అధికారులు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ వనరులు దోచేస్తున్నా వ్యవస్థలు ఏం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్టు మెషీన్ల పేరుతో రాష్ట్రంలో భారీ దోపిడీ జరిగిందన్నారు. సమావేశంలో అడబాల వీర బ్రహ్మజీ, కుసుమ చంద్రశేఖర్, అడబాల జానకీ రామ్, తాడి సహదేవ్, నామన మణికంత, జిల్లెళ్ల ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు

- వంద లీటర్ల సారా స్వాధీనం
- 3,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



వాడపల్లిలంకలో స్వాధీనం చేసుకున్న సారాతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామ సమీప లంకలో వంద లీటర్ల సారాను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కాత్యాయని బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా వాడపల్లి లంకలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3,400 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అదే ప్రాంతంలో పలుచోట్ల వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆ సారాకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. జిల్లా ఈఎస్ ఎస్ కేడీవీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఏఈఎస్ జి.అమర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో ఆలమూరు, రాజమహేంద్రవరం సీఐలు నాగేశ్వరరావు, పి.సుబ్బిరెడ్డి, అమలాపురం స్క్వాడ్ సీఐ చిరంజీవి, కొత్తపేట, రామచంద్రపురం, రాజమహేంద్రవరం స్టేషన్ల ఎస్సైలు కె.అన్నవరం, కె.సుబ్బారావు, బి.అప్పారావు, ఏ.రామానుజ, పి.సూర్యకుమారి, ఆయా స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాటరీ వెహికల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

- రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ఘటన
- పరారైన డ్రైవర్

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులను తరలించే బ్యాటరీ వెహికల్ ఢీకొని బుధవారం ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. సీతానగరం మండలం బొబ్బిలంక గ్రామానికి చెందిన ఎం.సాయి వల్లికాదేవి, విధులు నిర్వహించి ఇంటికి వెళుతున్న రైల్వే లోకో పైలట్ ఎంవీ రామారావును స్థానిక 2, 3 ప్లాట్‌ఫాంపై బ్యాటరీ వెహికల్ ఢీకొంది. ఈ ఘటనలో సాయివల్లికాదేవికి రెండు కాళ్లు, రామా రావుకు ఒక కాలు విరిగిపోయాయి. ఈ ప్రమాదానికి కారకుడైన బ్యాటరీ వెహికల్ డ్రైవర్ పరారయ్యాడు. ఈ ప్రమాదంపై రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదంలో గాయపడిన సాయి వల్లికాదేవి

ప్రమాదకరమే ...

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో బ్యాటరీ వాహనం ఏర్పాటు చేయడం ప్రమాదకరంగా తయారైంది. ఇక్కడి ప్లాట్‌ఫాంలు ఆ వెహికల్ రాకపోకలు సాగించేందుకు అనువుగా లేకపోవడమే దీనికి కారణం. బ్యాటరీ వాహనం నడిచేంత ఖాళీ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలిసినా రైల్వే అధికారులు మాత్రం బ్యాటరీ వాహనం నడిపేందుకు కాంట్రాక్టర్‌కు టెండర్ ద్వారా అప్పగించారు.

మట్టి అక్రమ తవ్వకాలపై దాడి



మానేపల్లిలంకలో జేసీబీలను సీజ్ చేసిన తహసీల్దార్ శ్రీపల్లవి, మైన్స్ ఆర్ఐ సుజాత

పి.గన్నవరం: మానేపల్లిలంక ర్యాంపులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై అధికారులు దాడి చేశారు. స్థానికుల సమాచారం మేరకు తహసీల్దార్ పి.శ్రీపల్లవి, మైన్స్ ఆర్ఐ సుజాత మానేపల్లి లంకకు చేరుకున్నారు. అనుమతులు ఉన్న ప్రాంతంలో కాకుండా మరోచోట మట్టిని తవ్వుతున్నట్టు నిర్ధారించారు. అక్కడ ఉన్న ఒక లోడు లారీని, ఐదు క్వారీ లారీలను, రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. లోడు లారీని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెన్నపు డాంగే, మైన్స్ టీఏ అలీ తదితరులు పాల్గొన్నారు. కాగా.. మానేపల్లి లంకలో సుమారు రెండు ఎకరాల లంక భూమి నుంచి ప్రభుత్వ పనుల నిమిత్తం మట్టిని తవ్వేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో నిర్వాహకులు నదీపాయలో బాటను నిర్మించి మట్టిని తీస్తున్నారు. అయితే అనుమతి ఉన్న చోట కాకుండా మరొక ప్రాంతంలో మట్టిని తీస్తుండటంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు.

బాలుడి మృతదేహం లభ్యం



విఘ్నేష్ మృతదేహం

ప్రత్తిపాడు: పెద శంకర్లపూడి గ్రామ సమీపంలోని ఏలేరు ఎడమ కాలువలో గల్లంతైన పంది వీర వెంకట సత్య నారాయణ (విఘ్నేష్) (15) మృతదేహం బుధవారం లభ్యమైంది. కాలువలో స్నానానికి దిగి మంగళవారం సాయంత్రం విఘ్నేష్ గల్లంతైన విషయం విధితమే. రాత్రి వరకు గజ ఈతగాళ్లతో గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఉదయం తిరిగి ఏలేరు కాలువలో గాలింపు చేపట్టారు. అయితే విఘ్నేష్ కాలువలో దిగిన ప్రాంతంలోనే నీటి అడుగున బురదలో చిక్కుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని గజఈతగాళ్ల వెలికి తీశారు. అనంతరం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మృతుడి తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపారు. కాగా.. విఘ్నేష్ లంపకలోవ జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. తన సోదరుడు, స్నేహితులతో కలిసి కాలువలో ఈతకు వెళ్లగా ఈ ప్రమాదం జరిగింది. కాకినాడ సిరిని స్థానికులు కాపాడగలిగారు. కానీ విఘ్నేష్ నీటి అడుగున బురదలో చిక్కుకుని మృతి చెందాడు.

ఎదురెదురుగా లారీల ఢీ

తాళ్లపూడి (కొవ్వూరు): ఇసుక లారీ, ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వాటిలోని డ్రైవర్లు గాయాలపాలయ్యారు. ఆరికిరేవుల వద్ద గోదావరి గట్టుపై పోశాలమ్మ గుడి సమీపంలో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. ఇసుక కోసం టిప్పర్ కుమారదేవం వైపునకు వెళుతోంది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్యాంకర్ వచ్చింది. ఈ రెండు ఢీకొనడంతో ఇసుక లారీ నడుపుతున్న నిడదవోలుకు చెందిన గంటా శ్రీనివాసరావు కాలు స్టీరింగ్, సీటు మధ్యలో ఇరుక్కుపోయింది. అతడిని స్థానికులు జాగ్రత్తగా బయటకు తీసుకువచ్చి, కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్యాంకర్ డ్రైవర్‌కూ స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా ప్రదేశానికి అగ్నిమాపక వాహనం వచ్చింది. జేసీబీతో లారీలను పక్కకు తీసి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూశారు.

పాలిసెట్‌లో 'తిరుమల' విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న సతీష్ బాబు, శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యార్థులు సత్తా చాటారు. వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్ శ్రీరామ్, బల్లా రిషిత శ్రీస్వప్న, రూపిటి చహ్నా అనే నలుగురు విద్యార్థులు 120 మార్కులకు 120 మార్కులు సాధించారు. ఆ విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు మాట్లాడుతూ 9 మంది విద్యార్థులు 119 మార్కులతో ప్రతిభ చూపారన్నారు. స్టేట్ 5, 7, 10, 11వ ర్యాంకులకు కైవసం చేసుకున్నామన్నారు. అలాగే 50 లోపు 9 మంది, 100 లోపు 16 మంది, 500 లోపు 57 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. ఆ విద్యార్థులను తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

జాబితాలు రెడీ..

- తుది దశకు చేరుకున్న పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియ
- ఎంపీఎస్ హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లు
- 3,851 మందికి తప్పనిసరి బదిలీ

రాయవరం: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మంగళవారం ఉదయం నుంచి ఈ ప్రక్రియ జిల్లాల వారీగా కొనసాగుతోంది. ఉపాధ్యాయుల సీనియారిటీ, క్లియర్ వేకెన్సీ, గ్రేడ్–2 ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీల స్టేషన్ సీనియారిటీ తదితర జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా బదిలీలు చేపడతారు. గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ఐదు అకడమిక్ ఇయర్స్ సర్వీసు ఉంటే తప్పనిసరిగా బదిలీ కావాలి. స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలు ఎనిమిది అకడమిక్ సంవత్సరాల సర్వీసు ఒకే పాఠశాలలో పూర్తి చేస్తే తప్పనిసరిగా బదిలీ కావాలి. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా పాఠశాల విద్యాశాఖ తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజించింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు తయారైన జాబితా ప్రకారం 3,851 మంది ఉపాధ్యాయులకు తప్పనిసరిగా బదిలీ అయ్యే అవకాశముంది. అయితే ప్రస్తుతం చేస్తున్న ప్రక్రియ తుది దశకు చేరుకుంటే ఈ సంఖ్యలో మార్పులు ఉండే అవకాశముంది. వీరిలో గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు, వివిధ సబ్జెక్టులకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు ఉన్నారు. అలాగే రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీ చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. ఈ విధంగా సుమారు 8 వేల మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ చేసుకునేందుకు అర్హత పొందుతారు. సీనియారిటీ జాబితాలు, ఉపాధ్యాయుల వేకెన్సీ తదితర వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతే బదిలీల జీవో విడుదలయ్యే అవకాశం ఉంది. బుధవారం రాత్రికి ప్రక్రియ పూర్తయ్యే అవకాశమున్నట్లుగా తెలియవచ్చింది.

టీఐఐకేఎంతో 'నన్నయ'కు ఒప్పందం



ఎంఓయూలను మార్చుకుంటున్న వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

రాజానగరం: శ్రీలంకకు చెందిన ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ (టీఐఐకేఎం)తో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి ఒప్పందం కుదిరింది. ఇందుకు సంబంధించిన పత్రాలను వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, టీఐఐకేఎం ప్రతినిధి ఇసాంక పి.గమగే పరస్పరం సంతకాలు చేసి మార్చుకున్నారు. అంతర్జాతీయ సంస్థతో ఎంఓయూ కుదరడం వల్ల రాబోయే కాలంలో అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ, జాయింట్ రీసెర్చ్, వెబ్‌నార్స్ వర్క్‌షాపులు, ట్రైనింగ్ ప్రోగ్రాములు, పబ్లిక్ సర్వీసెస్ వంటి కార్యక్రమాల నిర్వహణకు అవకాశం ఉంటుందన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: తుని–హంసవరం మధ్యలోని బాలయోగి మెట్ట సమీపంలో పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తి.. రైలు ఢీకొని మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. అతడి వద్ద ఎరుపు, తెలుపు రంగు టవల్ ఉందని, కుడి చేతిపై శ్రీరాములు అనే పచ్చబొట్టు ఉందన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.